సమాజం నాడి పట్టారు...

- పేదలకు సేవలందిస్తున్న సామాన్య వైద్యులు
- వైద్య విద్యపై ఆసక్తి చూపుతున్న మహిళలు
- అమ్మనాన్నలే స్ఫూర్తి

కపిలేశ్వరపురం: జీవితంలో ఎలాంటి సమస్యనైనా ఎదిరించాలంటే ముందు ఆ మనిషి సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలి. ఆరోగ్యంతో ఉన్న మనుషులున్న సమాజం ప్రకృతి ఒడిలో వికసించగలదు. పెరిగిన ఆధునికత, మారిన ఆహారపు అలవాటు, పర్యావరణ సమస్యల కారణంగా మానవ ప్రాణానికి ముప్పు వాటిల్లుతోంది. చిన్నపాటి సమస్యలకే ఆసుపత్రి పాలవుతున్నారు. ఈ నేపథ్యంలో వైద్య విద్య, వైద్య వృత్తి ప్రాధాన్యత విశేషంగా పెరిగింది. కోట్లాది మందికి సేవలందించేందుకు అదేస్థాయిలో వైద్యులు అవసరమే. మానవ శరీరాన్ని, వ్యాధుల తీరును అధ్యయనం చేసే డాక్టరు చదువు ఒకింత కష్టమైనదే. అయినప్పటికీ ఎంతో ఆసక్తితో, తల్లిదండ్రుల ప్రేరణతో, ప్రభుత్వ ప్రోత్సాహంతో వైద్య విద్యను పూర్తి చేసుకుని డాక్టరుగా రాణిస్తున్నారు అనేక మంది మహిళలు. వారంతా నేటి విద్యార్థులకు స్ఫూర్తిదాయకం.


హైదరాబాద్ ఆసుపత్రిలో పుట్టిన బిడ్డతో ఇంటర్న్‌షిప్ విద్యార్థిని డాక్టర్ పెద్దింశెట్టి జెన్నీ పల్లవి

విద్యా సంవత్సరం పూరై్తంది. ఫలితాలు ఒక్కొక్కటీ విడుదలవుతున్నాయి. వైద్య విద్య అభ్యసించాలంటే ఇంటర్‌లో చేరేటపుడే నిర్ణయం తీసుకోవాలి. అలా నిర్ణయించుకుని జీవితంలో డాక్టరులైన కొందరి మనోభావాల సారాంశమే ఈ రోజు కథనం.


అంగరలో రోగి ఇంటికెళ్లి వైద్య సేవలందిస్తున్న పీహెచ్‌సీ వైద్యాధికారి రత్నకుమారి

సమాజంపై గౌరవంతో..



గ్రామాల్లోని పరిస్థితులను చూసి సమాజంలో మనుషుల మధ్య అంతరాలను గమనించాను. అంతరాలు పోయి అందరూ తలెత్తుకు జీవించేందుకు చదువొక్కటే మార్గం అనుకున్నాను. ల్యాబ్‌టెక్నీషియన్ అయిన నాన్న సత్యంతో కలిసి మండపేటలోని సాయిలక్ష్మి నర్సింగ్ హోమ్‌కు వెళ్తుండేదాన్ని. అక్కడ విజయలక్ష్మి డాక్టర్ గారు నాకు స్ఫూర్తిగా నిలిచారు. 2017–2022లో ఒంగోలు రిమ్స్‌లో సమయాన్ని వృథా చేయకుండా చదివాను. నా కుటుంబానికి మంచి గిఫ్ట్ ఇచ్చానన్న భావన కలిగింది. పీజీ చదివే ప్రయత్నంలో ఉన్నాను.

– కందుకూరి విజయశ్రీ , అంగర, కపిలేశ్వరపురం మండలం

సామాజిక సేవా దృక్పథంతో..



అంగరకు చెందిన తాతయ్య పెద్దింశెట్టి సూర్యనారాయణమూర్తి శిల్పకళాకారుడు. అనేక మందికి తన కళను నేర్పారు.ఆయనను చూసి జీవితంలో నాకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకోవాలనుకున్నాను. అమ్మ సత్యవతి తన డెలివరీ సమయంలో ఇబ్బంది పడిందని తెలుసుకుని ఎలాగైనా డాక్టర్ అవ్వాలని నిర్ణయానికి వచ్చాను. అమ్మ సత్యవతి, నాన్న రామకృష్ణ ప్రోత్సాహంతో ఎంబీబీఎస్ పూర్తి చేసుకుని హైదరాబాద్‌లో ఇంటర్న్‌షిప్ చేస్తున్నాను. డాక్టర్ చదువును సామాజిక సేవా దృక్పథంతో చదివితే జీవితాన్ని ఆస్వాదించగలుగుతామన్న భావన కలిగింది. రోగులకు సేవలందించేటప్పుడు ప్రాణం విలువను మరింత అర్థం చేసుకోగలిగాను.

– పెద్దింశెట్టి జెన్నీ పల్లవి, అంగర, కపిలేశ్వరపురం మండలం

ఆ మాటలు బాధించేవి



సుందరపల్లికి చెందిన నాన్న అడపా సత్యనారాయణ ప్రైవేట్ ఫ్యాక్టరీలో సాంకేతిక నిపుణుడు. అమ్మనాన్నలకు ముగ్గురమూ అమ్మాయిలమే పుట్టాం. మగపిల్లాడు పుట్టి ఉంటే బావుండేదంటూ అమ్మ శ్యామలాదేవి దగ్గర పలువురు అనడాన్ని గమనించాను. ఆర్థిక సమస్యలు ఎలాగూ వెంటాడేవి. బాగా చదువుకోవడం ద్వారా సమాజంలో మంచి పొజిషన్‌కు వెళ్లగలుగుతారని నాన్ననేవారు. నాన్న ప్రోత్సాహంతో భీమవరం విష్ణు డెంటల్ కళాశాలలో చదువు పూర్తి చేశాను. మా అక్కలిద్దరూ ప్రైవేట్ కళాశాలల్లో అధ్యాపకులు. ముగ్గురూ చదువుల్లో రాణించడంతో అమ్మా, నాన్న సంతోషించారు.

– అడపా మహీజ, సుందరపల్లి, కె.గంగవరం మండలం

ప్రభుత్వాసుపత్రిలో సేవ సంతృప్తి ఇస్తుంది



శ్రీకాకుళంలోని రిమ్స్ ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ చదివాను. నేను డాక్టరునయ్యేందుకు వేళంగికి చెందిన నాన్న పట్నాల శ్రీనివాసగుప్తా, అమ్మ సీతాకుమారి మార్గదర్శకులు. 2020 మార్చిలో ఎంబీబీఎస్ చదువు పూర్తికాగానే మేలో కాకినాడ జీజీహెచ్‌లో డాక్టరుగా ఉద్యోగం వచ్చింది. చదువు, ఉద్యోగం రెండూ ప్రభుత్వ రంగంలోనే అవకాశాలొచ్చాయి. కరోనా సమయంలో కాకినాడ జీజీహెచ్‌లో అందించిన సేవలను ప్రశంసిస్తూ రోగులు చెప్పిన మాటలను నా జీవితంలో నాకు సంతృప్తి ఇచ్చాయి. 2022 మార్చి నుంచి అంగర పీహెచ్‌సీలో సేవలందిస్తున్నాను. ఇటీవలే నా చేతుల మీదుగా 20వ ప్రసవాన్ని జరిపించాను.

– డాక్టర్ పీఎస్ఎస్‌డీ రత్నకుమారి, వైద్యాధికారి అంగర పీహెచ్‌సీ

మహిళ తన కాళ్లపై తాను నిలబడాలన్నారు



సాధారణ కుటుంబానికి చెందిన నేను అమ్మ, నాన్నల ప్రోత్సాహంతో డాక్టరునయ్యాను. నన్ను డాక్టర్‌గా చూడాలన్న కోరిక నాన్నది. మహిళ తన కాళ్ళపై తాను నిలబడాలని అనేవారు. అమ్మ, నాన్న ఇద్దరూ చదువుకునేందుకు తమ శక్తికి మించి ప్రోత్సహించారు. 2012–18లో ఎంబీబీఎస్ చదివాను. ప్రస్తుతం ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్‌గా సేవలందిస్తున్నందుకు గర్వపడుతున్నాను. ఆసుపత్రికి వైద్యం కోసం వచ్చేవారంతా పేద, మధ్య తరగతికి చెందిన వారే.

– డాక్టర్ నాగాబత్తుల కరుణేంద్రకుమారి, అచ్యుతాపురం పీహెచ్‌సీ వైద్యురాలు, కపిలేశ్వరపురం మండలం

క్లుప్తంగా

రాష్ట్ర సంఘం ప్రత్యేక ఆహ్వానితులుగా ఎంపికపై హర్షం

రామచంద్రపురం రూరల్: ఆలిండియా గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం ఆంధ్ర రాష్ట్ర మహాసభలలో రాష్ట్ర సంఘం ప్రత్యేక ఆహ్వానితులుగా దుప్పలపూడి బీపీఎం వై.కామేశ్వరి, కాంద్రకోట బీపీఎం ఎ.సురేంద్రనాథ్ ఎంపిక చేశారు. ఈ విషయం సంఘం రామచంద్రపురం బ్రాంచ్ మాజీ అధ్యక్షుడు జీవీకే రామయ్య, కొప్పిశెట్టి రమణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంఘ పటిష్టత కోసం కష్టపడి పనిచేసే వారికి సముచిత స్థానం కల్పించడంపై ఉద్యోగులలో హర్షాతిరేఖాలు వెల్లువెత్తుతున్నాయని తెలిపారు.

రోడ్డుపై చెత్తకుప్పలు తొలగించాలి

కాజులూరు: పెనుమల్లలో రోడ్లపై పేరుకుపోయిన చెత్తను తొలగించేందుకు పంచాయతీ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. గ్రామంలో సరైన డంపింగ్ యార్డ్ సదుపాయం లేకపోవడంతో స్థానికులు చెత్తా చెదారం గ్రామ ముఖద్వారం వద్ద రోడ్డు పక్కన వేస్తున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు కారణంగా రోడ్డుపై చేరిన చెత్త కుళ్లిపోయి దుర్వాసన వెదజల్లుతోందని వాపోతున్నారు. రోడ్లు అధ్వానంగా తయారై పారిశుధ్య అస్తవ్యస్తంగా తయారవుతుందని దీంతో అంటురోగాలు ప్రబలే అవకాశం ఉందని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి చెత్త కుప్పలు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రైవేటీకరణను విరమించుకోవాలి

మండపేట: విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలని ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకుడు చీకట్ల వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. వామపక్ష పార్టీల పిలుపు మేరకు బుధవారం స్థానిక కలువ పువ్వు సెంటర్ వద్ద ధర్నా నిర్వహించి నిరసన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రజావ్యతిరేక పాలన సాగిస్తూ ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటీకరణ చేస్తోందన్నారు. రైస్‌మిల్లు జట్టు నాయకులు కొప్పిశెట్టి రాంబాబు, లోవరాజు, గంధం బూరయ్య, సత్యనారాయణ, నలమామిడి శ్రీను, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

కె.గంగవరం: కూళ్ల ఏటిగట్టు ఆనుకుని ఉన్న గణపతి విజయదుర్గమ్మ అమ్మవారి ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని బుధవారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధికి విరివిగా విరాళాలు ఇచ్చిన వింజయూరి వెంకటేశ్వరరావు, మంగరాజు దంపతులు పీటల మీద కూర్చొని గణపతి హోమం నిర్వహించారు. ఆలయం ఆలయం వద్ద మధ్యాహ్నం భారీ అన్నదానం నిర్వహించారు. గ్రామస్తులతో పాటు చుట్టు పక్కల గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

చిన్నారి కుటుంబానికి ఎన్నారై ఆర్థిక సహాయం


ఆదిలక్ష్మికి ఆర్థిక సహకారం అందిస్తున్న దేవానందరాజు, చింతా గణేష్

కాజులూరు: కోలంకలో రెండు రోజుల క్రితం కారులో డోర్‌లాక్ అయ్యి ఊపిరాడక మృతి చెందిన చిన్నారి తొగర అఖిలాండేశ్వరి కుటుంబానికి యానంకు చెందిన ఎన్నారై చింతా గణేష్ ఆర్థిక సాయం అందజేసారు. చిన్నారి తల్లి ఆదిలక్ష్మికి భర్త రెండేళ్ల క్రితం చనిపోయారు. గ్రామంలోని పలువురి ఇళ్ల వద్ద పనిచేసుకుంటూ తన కుమారుడు, కుమార్తెను పోషించుకుంటోంది. ఈ కుటుంబాన్ని ఆదుకోవాలని అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తూ సెలవులపై గ్రామానికి వచ్చిన ఎన్నారై చింతా గణేష్ చిన్నారి తల్లి ఆదిలక్ష్మికి రూ.25వేల ఆర్థిక సాయం, దుస్తులు అందించారు. విశ్రాంత ఉపాధ్యాయుడు, ప్రముఖ కవి దాట్ల దేవానందరాజు చేతుల మీదుగా నగదును అందించారు.

డీజిల్ అక్రమ రవాణాను అరికట్టాలి

యానాం: కేంద్ర పాలిత ప్రాంతం యానాంలో వివిధ పెట్రోలియం బంకుల నుంచి అక్రమంగా డీజిల్‌ను తరలిస్తున్నారని, దీనిని అరికట్టాలని కోరుతూ బుధవారం సివిల్ సప్లయిస్ అథారిటీ కమ్ ఆర్ఏఓ మునిస్వామికి స్థానిక నాయకులు మాగాపు సుబ్బారావు, సుంకర కార్తీక్ ఫిర్యాదు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ మండలాలకు అక్రమ రవాణా జరుగుతుందని, దీనిని అరికట్టేందుకు పోలీస్ నిఘాను పటిష్టం చేయాలని కోరారు.

క్రాస్‌బండ్ పనుల పరిశీలన

యానాం: పిల్లంక- బ్రహ్మపురి మధ్య ఫ్రెంచ్ కెనాల్ వద్ద క్రాస్‌బండ్ నిర్మాణ పనులను బుధవారం ఆర్ఏఓ మునిస్వామి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో తాగునీటి ఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామన్నారు. ఫ్రెంచి కెనాల్ నుంచి వచ్చే నీటి ప్రవాహం బాగా తగ్గిందని, ఈ నేపథ్యంలో ఆ ప్రదేశంలో క్రాస్‌బండ్ నిర్మిస్తున్నామన్నారు. అక్కడి నుంచి మోటార్‌ల ద్వారా నీటిని ఫ్రెంచ్ కెనాల్ కాలువలోకి ఎత్తి పోస్తామన్నారు. కీలకమైన శంకరపాలెం-యానాం బైపాస్‌ను చేర్చి ఉన్న 55 ఎకరాల చెరువులను పూర్తి స్థాయిలో నింపుతున్నట్లు తెలిపారు.

వదలని వాన

- కళ్లాల్లోనే ధాన్యం
- దిక్కుతోచని అన్నదాతలు


మండపేటలో ధాన్యం రాశిపై బరకాలు కప్పి ఉంచిన దృశ్యం

మండపేట: ఆరుగాలం శ్రమించి పండించిన పంట చేతికందే సమయంలో రైతుల ఆశలపై అల్పపీడన ద్రోణి నీళ్లు చల్లుతోంది. నియోజకవర్గంలో 50 శాతం మేర వరికోతలు పూర్తి కాగా అధిక శాతం ఫలసాయం కళ్లాల్లోనే ఉండిపోయింది. నాలుగు రోజులుగా తెరిపి ఇవ్వకుండా కురుస్తున్న వర్షాలు కర్షకులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లో 97 వేల ఎకరాల్లో రైతు రబీ సాగు చేశారు. పంట తుది దశకు చేరుకోగా పది రోజుల క్రితమే మాసూళ్లు మొదలుపెట్టారు. ఎక్కడికక్కడ వరి కోతలు, తేమ శాతం తగ్గించుకునేందుకు ధాన్యం ఆరబోతలు, ఆరిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించే పనిలో రైతులు బిజీగా ఉన్నారు. పనులు ముమ్మరంగా జరుగుతున్న తరుణంలో ద్రోణి ప్రభావంతో నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలు రైతులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. కొద్దిసేపు తెరిపిచ్చినా అంతలోనే మరలా జల్లులు పడుతూ రైతులను ఉరుకులు పరుగులు పెట్టిస్తున్నాయి. తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టేందుకు వీలులేక రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. బుధవారం మండపేట, మండల గ్రామాల్లో ఉదయం కొంత వరకు తెరిపివ్వగా మధ్యాహ్నం నుంచి వర్షం పడుతూనే ఉంది.

అండగా అధికార యంత్రాంగం

ప్రస్తుతం నెలకొన్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తోంది. రెవెన్యూ, వ్యవసాయ శాఖల అధికారులను క్షేత్రస్థాయిలోకి పంపి నష్టనివారణపై రైతులకు అవగాహన కల్పిస్తోంది. ఆరిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మండపేట తహసీల్దార్ టీఆర్ రాజేశ్వరరావు, ఎంపీడీఓ ఐ.రాజు, వ్యవసాయాధికారి కె. ఏసుబాబులు సిబ్బందితో కళ్లాల్లోకి వెళ్లి ధాన్యాన్ని పరిశీలిస్తున్నారు. రైతులకు అవసరమైన సూచనలు ఇస్తున్నారు. వర్షం తగ్గాక పంటకు ఎంత మేర నష్టం వాటిల్లిందో చెప్పగలమని ఏఓ ఏసుబాబు తెలిపారు.

రైతులకు అండగా అధికార యంత్రాంగం

కపిలేశ్వరపురం: అకాల వర్షం వీడలేదు. రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వాదేశాలపై మండల, గ్రామ, వ్యవసాయ అధికారులు రైతులకు అండగా నిలుస్తున్నారు. బుధవారం ఉదయానే ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి, మండల వ్యవసాయాధికారి కేవీఎస్ రమేష్‌కుమార్‌లు గ్రామాల్లో పర్యటించారు. రైతు భరోసా కేంద్రాల్లోని వ్యవసాయ సహాయకులు, వీఆర్వోలు క్షేత్రస్థాయిలో వరి ధాన్యం పరిస్థితిని సమీక్షించారు. ఎండ వచ్చినపుడు రైతులు రహదారులపై ధాన్యాన్ని ఆరబెట్టుకోగా మధ్యాహ్నం వర్షం కుండపోతగా కురిసింది. గాలి వాన వస్తుండగా రైతులు తమ ధాన్యంను బరకాలతో కప్పుకుని రక్షించుకున్నారు. అదే సమయంలో క్షేత్ర స్థాయిలోని సచివాలయ ఉద్యోగులు రైతులకు సాయం చేయడం పడమర ఖండ్రిక, అంగర, తదితర గ్రామాల్లో కనిపించింది. ప్రభుత్వం తడిచిన ధాన్యంను కొనేందుకు సిద్ధంగా ఉందని, ఆందోళన చెందవద్దంటూ ఎంపీడీఓ, తహసీల్దార్ కొమరం సూర్యారావు, ఏఓ రమేష్‌కుమార్‌లు రైతులకు భరోసా ఇచ్చారు.

వర్షం వచ్చింది.. రైతును ముంచింది

కాజులూరు: వరుసగా కురుస్తున్న వర్షాలకు రైతులు కష్టాల ఊబిలో కూరుకుపోతున్నారు. ఆరుగాలం శ్రమించి పండించిన పంట వర్షానికి తడిసిపోతుంటే ఏం చేయలేని పరిస్థితిలో ఉన్నారు. ఈ ఏడాది పంటల పెట్టుబడికి తెచ్చిన అప్పులకు వడ్డీ కూడా రాదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఆవర్తనద్రోణి ప్రభావంతో గత నాలుగు రోజులుగా ఎడతెరపిలేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు నియోజకవర్గంలోని రైతన్నలు కుదేలయ్యారు. పొలాల్లో వరి పంట నేలకొరిగింది. మాసూళ్లు చేసి కళ్లాల్లో ఆరబెట్టిన ధాన్యం తడిసిముద్దయ్యాయి. వాటిని రక్షించుకునేందుకు రైతులు నానాతంటాలు పడుతున్నారు. నియోజకవర్గంలోని కాజులూరు, రామచంద్రపురం, కె.గంగవరం మండలాల్లోని వరి పొలాలు తూర్పుడెల్టా కాలువ శివారు భూముల్లో ఉన్నాయి. స్థానికంగా కురిసే వర్షాలకు తోడు ఎగువ ప్రాంతాల నుంచి వచ్చి చేరుతున్న వరద నీరు ఇక్కడి పల్లపు ప్రాంతాలను ముంచెత్తుతున్నాయి. ఉన్న పంటను రైతులు ఒబ్బిడి చేసుకుందామన్న కొనసాగుతున్న భారీ వర్షాలు రైతులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. తూర్పు తీరం వెంబడి మరో రెండు, మూడు రోజులు భారీ వర్షాలు కురిసేందుకు అవకాశం ఉందని వాతావరణ నిపుణుల ప్రకటనలు రైతులు ఆందోళన చెందుతున్నారు.


పడమర ఖండ్రికలో చినుకులు పడుతుండగా ధాన్యంపై బరకా కప్పుతున్న సచివాలయ ఉద్యోగులు


కాజులూరు మండలం ఆర్యావటంలో వర్షం నీటిలో నానుతున్న వరి


కాజులూరు మండలం గొల్లపాలెంలో నీట నానుతున్న వరి పనలను చూపుతున్న రైతులు

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

మండపేట: అకాల వర్షాలతో పంట నష్టపోతున్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు కోరారు. మండలంలోని జెడ్.మేడపాడులో తడిసిన ధాన్యాన్ని బుధవారం ఆయన పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేగుళ్ల మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్ల వేగవంతం చేయించాలని, తడిసిన, మొలకలు వచ్చిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

పంట పొలాల పరిశీలన

- ఏఓ సత్యప్రసాద్


ఉండూరులో రైతులకు సూచనలు చేస్తున్న ఏఓ సత్యప్రసాద్

రామచంద్రపురం రూరల్: అకాల వర్షాలతో దెబ్బ తిన్న వరి పంట పొలాలను మండల వ్యవసాయ అధికారి ఎస్.సత్యప్రసాద్ బుధవారం పరిశీలించారు. ఉండూరు గ్రామాన్ని ఆయన సందర్శించి రైతులతో మాట్లాడుతూ అకాల వర్షాలకు ధాన్యం తడిచినట్టయితే మొలకెత్తి, రంగు మారే ప్రమాదం ఉందని తెలిపారు. నివారణకు ఒక టన్ను ధాన్యంలో ఒక కేజీ ఉప్పు, 10 కేజీల ఊక కలిపిన మిశ్రమంలో ధాన్యాన్ని పొరలుగా పోసి కలపాలన్నారు. అదే విధంగా వరి చేలు పడిపోయినా, పనలపై ఉన్నా వర్షం తగ్గిన తరువాత నీరు బయటకు తీసివేసి ఒక లీటరు నీటికి 20 గ్రాముల కల్లు ఉప్పు కలిపి పిచికారీ చేయాలన్నారు. దీనివల్ల గింజ మొలవకుండా, రంగు మారకుండా ఉంటుందని తెలిపారు.

తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలి

రామచంద్రపురం రూరల్: అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి చీకట్ల వెంకటేశ్వరరావు, అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా నాయకుడు వెంటపల్లి భీమశంకరం బుధవారం ఒక ప్రకటనలో కోరారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో వరి పంటకు నష్టం ఎక్కువగా ఉందన్నారు. 9,677 ఎకరాల్లో సుమారు 30 వేల టన్నుల ధాన్యం రాశులుగా కళ్లాల్లో ఉందన్నారు. పక్వ దశకు సిద్ధంగా ఉన్న 2,270 ఎకరాల్లో గాలి, వర్షానికి పంట నేలనంటిందన్నారు. తూర్పుగోదావరి జిల్లాలో ఉద్యాన పంటలకు భారీ నష్టం వాటిల్లిందన్నారు.

అన్నదాతలను ఆదుకోవాలి

రామచంద్రపురం రూరల్: వెంకటాయపాలెంలో వర్షాలకు తడిచిన ధాన్యాన్ని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఆయన వెంట ఆ పార్టీ నాయకులు బుంగ రాజు, సంపతి సత్యనారాయణ మూర్తి, బొండా వెంకన్న, కణితి రాంబాబు, ఎంపీటీసీ చిక్కాల స్వామికాపు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు టీకాలు

ఆలమూరు: చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ పరిధిలో చిన్నారులకు టీకాలు వేసినట్టు వైద్యాధికారులు ఎం.సుమలత, పి.భవానీశంకర్, ఆర్.సుదర్శన్‌బాబు, డి.సువర్చలానాయుడు తెలిపారు. ఆయా పీహెచ్‌సీల పరిధిలోని సబ్ సెంటర్లలతో పాటు ఆలమూరు ప్రభుత్వ ఆస్పత్రిలో బుధవారం టీకాలు వేశారు. పినపళ్ల, చింతలూరు, పెనికేరు, చొప్పెల్ల, చెముడులంక, మడికి, గుమ్మిలేరు, నర్శిపూడి గ్రామాల్లో చిన్నారులకు టీకాలు, గర్భిణులకు ఇంజక్షన్లు వేశారు.

వినాయక ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

కె.గంగవరం: కూళ్లలో బుధవారం నూతన వరసిద్ధి వినాయక ఆలయానికి రాష్ట్ర మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల కృష్ణ తనయుడు చెల్లుబోయిన నరేన్ కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు ఆలయ నిర్మాణానికి మంత్రి చెల్లుబోయిన వేణు తిరుమల తిరుపతి దేవస్థానం నిధుల నుంచి రూ.10 లక్షల మంజూరు చేశారన్నారు. నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించి త్వరంలో ఆలయ ప్రారంభోత్సవం నిర్వహిస్తామన్నారు. ఆలయ నిర్మాణానికి నిధులు మంజూరు చేసినందుకు గ్రామ సర్పంచ్ చీకట్ల సునీత, వైస్ ఎంపీపీ నీతిపూడి మదుబాల మంత్రి చెల్లుబోయిన వేణుకు కృతజ్ఞతలు తెలిపారు. సొసైటీ అధ్యక్షుడు వైట్ల అచ్యుత రామ ప్రసాద్, ఎంపీటీసీ కొప్పిశెట్టి లక్ష్మణ్, సచివాలయ మండల కన్వీనర్ తోకల శ్రీను, గ్రామ పెద్దలు గోపాలం, కొండ తదితరులు పాల్గొన్నారు.


ఆలయ నిర్మాణానికి కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేస్తున్న మంత్రి తనయుడు నరేన్

సాహితీ సేవలు ప్రశంసనీయం

యానాం: వృత్తి రీత్యా కళాశాల ప్రిన్సిపాల్‌గా విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేస్తూ మరోవైపు ప్రవృత్తిగా సాహితీ రంగంలో డాక్టర్ వరుగు భాస్కరరెడ్డి రాణించడం ప్రశంసనీయమని పలువురు పేర్కొన్నారు. బుధవారం పుదుచ్చేరి ప్రభుత్వం నుంచి ప్రతిష్టాత్మకమైన కలైమామణి అవార్డు అందుకున్న భాస్కరరెడ్డిని డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ప్రముఖ కవి దాట్ల దేవదానంరాజు మాట్లాడుతూ కళాశాల అధిపతిగా తీరిక లేకుండా ఉన్నా తెలుగు అధ్యాపకుడిగా సాహిత్యానికి, సాహితీ సభల నిర్వహణకు భాస్కరరెడ్డి ఎంతగానో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో కొండూరి రామరాజు, అధ్యాపకులు ఆర్‌వీవీ సత్యనారాయణ, యోగేందర్ సింగ్, సిద్ధిరెడ్డి శ్రీనివాస్, శాంతకుమార్, దుర్గయ్య, సూపరింటెండెంట్ లోవరాజు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతలకు రేపు సత్కారం

యానాం: పుదుచ్చేరి ప్రభుత్వ ప్రతిష్టాత్మక కలైమామణి అవార్డులను అందుకున్న యానాంకు చెందిన నలుగురిని 5న భారతీయ దళిత సాహిత్య అకాడమీ, న్యూఢిల్లీ, స్ఫూర్తి సాహితీ సమాఖ్య యానాం సంయుక్తంగా సత్కరించనుంది. బుధవారం ఈ విషయాన్ని నిర్వాహకులు పొనుగుమట్ల విష్ణుమూర్తి, దాట్ల దేవదానంరాజు ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక సమగ్రశిక్ష సమావేశ మందిరంలో అవార్డు గ్రహీతలు డాక్టర్ వరుగు భాస్కరరెడ్డి (సాహిత్యం), కోరుకొండ ప్రసాదరావు (నాటకం), ముమ్మిడి శ్రీవీరనాగప్రసాద్ (చిత్రకళ), గ్రంధి సత్యనారాయణ మూర్తి (శిల్పం) లను సత్కరిస్తారన్నారు.

జలమయమైన రోడ్లు


కాపవరంలో నీటితో నిండిపోయిన ఎస్సీ కాలనీ

రామచంద్రపురం: పట్టణంలో బుధవారం కురిసిన భారీ వర్షంతో రోడ్లు వర్షపు నీటితో నిండిపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పట్టణంలోని లోతట్టు ప్రాంతాలు నీటితో నిండిపోయాయి. పట్టణంలోని శివారు ప్రాంతాల్లో రోడ్లు, డ్రైన్లు నీట మునిగాయి. పల్లపు ప్రాంతాలైన మోడరన్ కళాశాల, సూర్యానగర్, అంకం వారి వీధి తదితర ప్రాంతల్లో పల్లపు రోడ్లు జలమయమయ్యాయి.

బిక్కుబిక్కు మంటున్న రైతులు

రామచంద్రపురం రూరల్: మండలంలో భారీగా కురుస్తున్న వర్షంతో బుధవారం పలు గ్రామాల్లో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. దీంతో జన జీవనం స్తంభించింది. మరో పక్క కళ్లాల్లో ఉన్న ధాన్యం ఉండిపోవడంతో రైతులకు నష్టమే మిగిలింది. అయితే గతంలో పంట నష్టం వాటిల్లినప్పుడు రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పంట నష్ట పరిహారం ఇచ్చేలా కృషి చేస్తామన్నారు. ప్రభుత్వం ఆదుకుంటుందన్న నమ్మకంతో రైతులు ఉన్నారు.

రైతుల అభ్యున్నతికి త్రిసభ్య కమిటీ కృషి చేయాలి

ఆలమూరు: రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయానికి ఇస్తున్న ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని సొసైటీల త్రిసభ్య కమిటీ సభ్యులు రైతుల అభ్యున్నతికి కృషి చేయాలని కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. మండలంలోని నర్శిపూడి పీఏసీఎస్ కార్యాలయంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నేత, ఉప సర్పంచ్ చల్లా వెంకట సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో బుధవారం త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారం జరిగింది. చైర్‌పర్సన్‌గా కడలి వెంకటరమణ, సభ్యులుగా గానుగుల ధనరాజు, బొక్కా వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. ఈ సందర్భంగా సర్పంచ్ కందిబొట్ల శ్రీనివాసు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి పాల్గొని ప్రసంగించారు. పంట నష్టపోయిన ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించి, తడిసిన ధాన్యాన్ని కొనుగులు చేసేలా చర్యలు తీసుకోవాలని నూతన పాలకవర్గాన్ని ఆదేశించారు. పంట నష్ట నివారణకు పకడ్బందీగా చర్యలు తీసుకుని రైతులకు గిట్టుబాటు ధరను కల్పించేలా కృషి చేయాలన్నారు. అనంతరం త్రిసభ్య కమిటీ సభ్యులను పూలమాలలు వేసి దుశ్శాలువ కప్పి ఘనంగా సత్కరించారు. వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు టేకి రాంబాబు, మాజీ ఉప సర్పంచ్ చల్లా పద్మావతి, ఎంపీటీసీ మేడిశెట్టి సుబ్బారావు, సీతఊఓ గంగరాజు కొండలరావు, దియ్యన పెద కాపు పాల్గొన్నారు.